సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 19 । జూలై । 2023



ఇంత నిర్లక్ష్యమా..!

లక్షల రూపాయలు విలువైన డిజిటల్ కియోస్క్, యంత్ర సామగ్రి ఆరుబయట నిరుపయోగంగా పడి ఉన్నాయి. 8లో



ఉన్నతస్థాయికి ఎదగాలి

చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని రంపచోడవరం మేజిస్ట్రేట్ ప్రవీర్ బంజదేవ్ సూచించారు. 8లో



వెదురు కొమ్ముల సీజన్ ప్రారంభం

మన్యంలో వెదురు కొమ్ముల సీజన్ ప్రారంభమైంది. వీటిని విక్రయిస్తూ గిరిజనులు మంచి ఆదాయం పొందుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

వరద ముందస్తు జాగ్రత్తలపై నేడు సమీక్ష

చింతూరు: వరద ముందస్తు జాగ్రత్తలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కారం సుబ్బారావు మంగళవారం తెలిపారు. వరదలొస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టబోయే సహాయక చర్యల గురించి ఈ సమావేశంలో చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. వరద ప్రభావిత గ్రామాలు, జనాభా వివరాలు, ముంపునకు గురయ్యే రహదారుల వివరాలతో మండలంలోని అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు మండలంలోని ప్రజా ప్రతినిధులకు సమావేశం గురించి తెలియచేసి వారు కూడా హాజరయ్యేలా చూడాలని ఆయన ఆదేశించారు.

మెనూ పాటించడం తప్పనిసరి

- ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న పీవో అభిషేక్

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన మెనూను తప్పనిసరిగా పాటించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు.మంగళవారం ఆయన మండలకేంద్రంలో పర్యటించారు. దీనిలో భాగంగా బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మెనూను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కలిసి భోజనం చేశారు. స్టాక్ రూమ్‌లో సరకుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం 9 వతరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎకో పల్పింగ్ యూనిట్‌ను సందర్శించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ చినన స్వామి పాల్గొన్నారు.

8,928 ధ్రువపత్రాల పంపిణీ

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలోని 14 మండలాల పరిధిలో 23 గ్రామ సచివాలయాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలు విజయవంతం అయ్యాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వలంటీర్లు 19,499 గృహాల నుంచి వివిధ ధ్రువపత్రాల నిమిత్తం యాప్‌లలో నమోదు చేసిన 17,353 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారన్నారు. వీటిలో 8,928 ధ్రువపత్రాలను మంగళవారం సాయంత్రానికి దరఖాస్తుదారులకు పంపిణీ చేశామన్నారు. మరో 27 దరఖాస్తులు తిరస్కరించామన్నారు. మిగతా ధ్రువపత్రాలను రెండు మూడు రోజుల్లో పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

గంజాయి కేసులో పాత నిందితుడి అరెస్టు



గంజాయి నిందితుడితో ఎస్‌ఐ సంతోష్‌కుమార్

దుంబ్రిగుడ: గంజాయి కేసులో పరారైన పాత నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. హుకుంపేట మండలం తీగేలివలస పంచాయతీ, పాములాయి గ్రామానికి చెందిన రాజు (42) అనే వ్యక్తి గంజాయి కేసులో నిందితుడు. అప్పటి నుంచి పరారీలో ఉండగా గాలించి మంగళవారం పట్టుకుని అరెస్టు చేశామని ఆయన పేర్కొన్నారు.

సారా బట్టీ ధ్వంసం.. ఒకరి అరెస్టు



అటవీప్రాంతంలోని సారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ షరీఫ్

రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాక పంచాయతీ మంగంపాడు అటవీప్రాంతంలో సారా బట్టీపై జడ్డంగి పోలీసులు మంగళవారం దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా మారేడుబాకకు చెందిన వ్యక్తిని పట్టుకున్నారు. అతడి నుంచి 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. బట్టీలోని పొయ్యిలు, సామగ్రి, 50 లీటర్ల పులుపును ధ్వంసంచేశామని ఆయన పేర్కొన్నారు. నిందితుడిని అడ్డతీగల జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచామని ఆయన వివరించారు.

స్తంభించిన జనజీవనం

జిల్లా వ్యాప్తంగా కుండపోత వానతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం రాత్రి వరకు జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు సమీప ప్రాంతాలలో ఏకదాటిగా వర్షం కురుస్తూనే ఉంది. పాడేరు, చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని అన్ని మండలాల్లోను విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.

- జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- 368 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- గెడ్డలు పొంగడంతో ఇళ్లకు పరిమితమైన గిరిజనం



ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బెగుల వాగు దాటుతున్న గిరిజనులు



పాడేరు అంబేద్కర్ సెంటర్‌లో తగ్గిన జన సంచారం

సాక్షి,పాడేరు: జిల్లాలోని గెడ్డలు, కొండవాగులు వరద నీటితో ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో గెడ్డలలో నీటి ప్రవాహం అధికంగా ఉంది. ఆయా గ్రామాల గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. జోలాపుట్టు జలాశయానికి నీరందించే ప్రధాన మత్స్యగెడ్డ, చాపరాయి, కురిడి, రాళ్లగెడ్డలు ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. గెడ్డల పరివాహక ప్రాంతాల గిరిజనులను రెవెన్యూ యంత్రాంగంతో పాటు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు అప్రమత్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో ఖరీఫ్ వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు, గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముంచంగిపుట్టులో అత్యధికంగా..

జిల్లాలోని 22 మండలాల పరిధిలో మంగళవారం 368 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని పాడేరు కలెక్టరేట్‌లోని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. ముంచంగిపుట్టు మండలంలో అత్యధికంగా 69.4 మిల్లీమీటర్లు, పెదబయలులో 34.6, హుకుంపేటలో 25, జి.మాడుగులలో 22.6, చింతూరులో 20.6, గూడెంకొత్తవీధిలో 20.2, డుంబ్రిగుడలో19.4, పాడేరులో 19.2, అరకులోయలో 18.6, ఎటపాకలో12.4, చింతపల్లిలో 12.2, అనంతగిరిలో 11.2, కొయ్యూరులో 11.2, మారేడుమిల్లిలో 10.2, దేవీపట్నంలో 10, వీఆర్‌పురంలో 9.6, గంగవరంలో 9, వై.రామవరంలో 8.6, అడ్డతీగలలో 7.2, కూనవరంలో 6.6, రాజవొమ్మంగిలో 5.6, రంపచోడవరంలో 4.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వారు పేర్కొన్నారు.

బిసయిపుట్టులో కూలిన ఇల్లు

హుకుంపేట: అల్పపీడన ప్రభావంతో మండలంలోని మంగళవారం ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. కొట్నాపల్లి పంచాయతీ బిసయిపుట్టులో సూకురు మోహన్‌రావు, సుబ్బలక్ష్మి దంపతులకు చెందిన పెంకుటిల్లు వర్షం కారణంగా కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రూ.60 వేలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

డుంబ్రిగుడ: మండలంలోని మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. గెడ్డలు పొంగి ప్రవహిస్తుండటంతో మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కొయ్యూరు: మండలంలో మంగళవారం ఉదయం నుంచి పొద్దుపోయేంత వరకు వర్షం కురుస్తూనే ఉంది.దీని మూలంగా పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. జాతీయ రహదారి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రోడ్డుపై మట్టిని వేసి వదిలి వేయడంతో వాహనచోదకులు సమస్యలు ఎదుర్కొన్నారు. వరి రైతులు వెదజల్లే విధానంలో సాగు చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు.

రెండు రోజుల నుంచి

జి.మాడుగుల: మండలంలో పలు ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో రోడ్లు, వీధులు, పంటపొలాలు జలమయయ్యాయి. మండలంలో సంతబయలులో మంగళవారం జరిగిన వారపు సంతకు వర్షం కారణంగా వినియోగదారులు రాలేదు. దీంతో కొనేవారు లేక దుకాణాలు వెలవెలబోయాయి. వర్షం కారణంగా పాడేరు-జి.మాడుగుల, చింతపల్లి, సుర్మతి, మద్దిగరువు, సొలభం, వంజరి రోడ్డు మార్గాల్లో రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



వర్షానికి బిసయిపుట్టులో కూలిన ఇల్లు



డుంబ్రిగుడ మండలంలో పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

పొంగిన వాగులు, గెడ్డలు

ఇళ్లకే పరిమితమైన గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. గత వారం రోజులుగా ముంచంగిపుట్టు మండలంతో పాటు సరిహద్దు ఒడిశా రాష్ట్రంలోను భారీ వర్షాలు పడుతునే ఉన్నాయి. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కేంద్రం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో ముంతగుమ్మి, బిర్రిగూడ, దొరగూడ,కర్లాపోదర్ గెడ్డలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీలకు చెందిన 19 గ్రామాల గిరిజనులు రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగింది. ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలను దాటలేక గిరిజనులు గ్రామాలకే పరిమితం అయ్యారు. కొంతమంది గిరిజనులు నిత్యావసర సరుకులు, అత్యావసర పనుల నిమిత్తం ప్రాణాలకు తెగించి ఉధృతంగా ప్రవహిస్తున్న బిర్రిగూడ గెడ్డను దాటుకొని లక్ష్మీపురం వచ్చారు. బుంగాపుట్టు గ్రామ గిరిజనులు ద్విచక్ర వాహనాలను సైతం మోసుకొని బిరిగూడ వాగును అతి కష్టం మీద దాటించారు. లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ, ఉబ్బెగుల గ్రామ గిరిజనులు చుట్టూ గెడ్డలు పొంగి ప్రవహించడంతో ఇళ్లకు పరిమితమయ్యారు.కొంత మంది గిరిజనులు ఉబ్బెగుల గెడ్డను అతికష్టం మీద దాటుకొని లక్ష్మీపురం పంచాయితీ కేంద్రానికి వస్తున్నారు. మంగళవారం మండలంలో గల బంగారుమెట్ట, భూసిపుట్టు పంచాయతీ కేంద్రాల్లో జరిగిన వారపు సంతలకు వర్షాల వల్ల కొనుగోలుదారులు రాకపోవడంతో బోసిపోయాయి.

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 10,159 మందికి రూ.10.94 కోట్లమేర లబ్ధి

సాక్షి, పాడేరు: జగనన్న తోడు చిరు వ్యాపారులకు చేయూతగా నిలుస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జగనన్నతోడు 7వ విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్, ట్రికార్ శతక బుల్లిబాబు, డీఆర్వో పి.అంబేడ్కర్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, పలువురు లబ్ధిదారులు కలెక్టరేట్ నుంచి వీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 7వ విడతకు సంబంధించిన 10,159 మంది లబ్ధిదారులకు రూ.10 కోట్ల 94లక్షల 10వేల విలువైన చెక్కును అందజేశారు. 6వ విడత జగనన్న తోడు రుణాలు పొంది సకాలంలో రుణాలు తిరిగి చెల్లించిన 2,396 మంది లబ్ధిదారులకు రూ.5లక్షల 27వేల 330 వడ్డీ చెల్లింపు చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్నతోడు రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిరువ్యాపారాల పెట్టుబడికి వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు డీపీఎం ఎస్.వైకుంఠరావు, వెలుగు సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు

డీసీసీబీ చైర్మన్‌గా కోలా గురువులు

విధేయతకు పట్టం



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా కోలా గురువులు నియమితులయ్యారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు జిల్లాలకు డీసీసీబీ చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. మూడేళ్లుగా కొనసాగుతున్న ప్రస్తుత చైర్‌పర్సన్ చింతకాయల అనిత పదవీ కాలం ఇటీవల ముగిసింది. దీంతో ఆ స్థానంలో గురువులను నియమిస్తూ వ్యవసాయం, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో ఆరు నెలలు లేదా తదుపరి ఎన్నికలు జరిగే వరకు కొనసాగుతారని పేర్కొన్నారు. తొలుత 2008లో ప్రజారాజ్యం పార్టీతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన 2009 అసెంబ్లీ ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి 2014లో అదే నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి ఓటమి చెందారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా పార్టీ పటిష్టతకు కృషి చేశారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2020లో గురువులు రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అప్పట్నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. కాగా మార్చిలో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ప్రకటించింది. అయితే ఒక్క ఓటు తేడాతో ఆయన ఓటమి చెందారు. వివాద రహితునిగా పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి గురువులకు ప్రతిష్టాత్మక డీసీసీబీ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. విధేయతకు పట్టం కట్టింది.

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసు

- సక్రమంగా విధులకు రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ

పెదబయలు: మండలంలోని కుంతుర్ల పంచాయతీ సంపంగిపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఎంఈవో-1 కె.కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 17వ తేదీన బొంగరం పంచాయతీలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుండగా సంపంగిపుట్టు గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరు ఉపాధ్యాయులపై ఫిర్యాదు చేశారు. మైదాన ప్రాంతం నుంచి బదిలీపై వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయులు సరిగ్గా విధులకు హాజరు కావడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన జిల్లా కలెక్టర్, డీఈవో దృష్టికి ఎమ్మెల్యే పాల్గుణ తీసుకువెళ్లారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించి నివేదికను వారికి సమర్పించామని ఎంఈవో-1 కృష్ణమూర్తి తెలిపారు. విధులకు సక్రమంగా హాజరు కాలేదని విద్యార్థులు తల్లిదండ్రుల మేరకు ఉపాధ్యాయులు కె.శంకర్రావు, కె. విజయలక్ష్మికి షోకాజ్ నోటీసు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు.

ప్రాధాన్యత భవనాలు త్వరితగతిన పూర్తి

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల హ భవన నిర్మాణాల పురోగతిపై పాడేరు డివిజన్ అధికారులతో భౌతికంగాను, రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లోను సమీక్షించారు. రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ భవన నిర్మాణాల పురోగతిపై మండలాలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలకు రూ.2.30,68,000 బిల్లును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఎక్కడా పెండింగ్ బిల్లులు లేకుండా పూర్తి చేసిన పనులకు వెంటనే బిల్లులు పెట్టి కాంట్రాక్టర్లకు చెల్లించాలన్నారు. నిర్మాణాలు తుదిదశకు చేరిన భవనాలను వచ్చే నెలాఖరు నాటికి త్వరితగతిన పూర్తి చేసి భవనాలు సంబంధిత అధికారులకు అప్పగించాలని సూచించారు. కాంట్రాక్టర్లకు ఫైనల్ బిల్లు చెల్లింపులకు అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. పాడేరు మండలం దేవాపురం రైతుభరోసా కేంద్రం పనుల జాప్యంపై సంబంధిత అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు రెండు భవనాలకు మించి పనులు అప్పగించవద్దన్నారు. అడ్వాన్స్‌లు తీసుకొని పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవన నిర్మాణాలకు రెండు వందల సిమెంటు బస్తాలు వరకు బయట కొనుగోలు చేయడానికి అనుమతించారు. ఈ సమావేశంలో పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రంపచోడవరం పీవో సూరజ్‌గనోరే, పంచాయతీ రాజ్ పీఐయూ ఈఈ కె.లావణ్యకుమార్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను చేర్పించాలి

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సమగ్ర సర్వే జరిపి బడిబయట ఉన్న పిల్లలను వెంటనే పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.మంగళవారం విద్యా,ఐసీడీఎస్,గిరిజన సంక్షేమశాఖ విద్య,ఇంజనీరింగ్‌శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా విద్యా కార్యక్రమాలు, పాఠశాలల అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనబడి నాడు-నేడు రెండవ విడత పాఠశాలల అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదన్నారు. గతవారంలో రూ.3కోట్ల నిధులు ఖర్చుచేశారని, ఇంకా రూ.2.60కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు.

గైర్హాజరైతే చర్యలు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విధులకు గైర్హజరైతే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.ఉపాధ్యాయుల హాజరు వివరాలను ఎంఈవోలు,ఏటీడబ్ల్యూవోలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.ఉపాధ్యాయులు పాఠశాలలకు రాకపోతే జీతాలు నిలిపివేస్తామని,గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్లు, మేట్రిన్లంతా రాత్రి 9గంటల వరకు విధుల్లో ఉండాలన్నారు.అన్ని గిరిజన విద్యాలయాల్లోను విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఏటీడబ్ల్యూవోలు వంటగది, స్టాక్‌రూమ్‌లను తనిఖీ చేయాలని ఆదేశించారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు తమ పరిధిలోని హెచ్‌ఎంలు,వార్డెన్లతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, డీఈవో సలీంబాషా,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి,గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- మూడు చక్రాల స్కూటీల పంపిణీ



రంపచోడవరంలో మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక పీఎంఆర్‌సీ వద్ద మంగళవారం మూడు చక్రాల వాహనాలను వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన మూడు చక్రాల స్కూటీలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రంపచోడవరం డివిజన్‌లో 30 వాహనాలు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పండా కుమారి, స్థానిక సర్పంచ్ మంగా బొజ్జయ్య, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, మండల సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, కొండ్రాజు,అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, కాపారపు రూతూ, చితుకుల య్యరెడ్డి, దండంగి సింహాద్రి పాల్గొన్నారు.

నేడు 13 మండలాల్లో సురక్ష శిబిరాలు

సాక్షి, పాడేరు: జిల్లాలోని 13 మండలాల పరిధిలో 18 గ్రామసచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.అడ్డతీగల మండలం డి.భీమవరం, చింతపల్లి మండలం కొత్తపాలెం-2,తాజంగి-1, దేవిపట్నం మండలంలో వీఆర్ పాలెం, జీకేవీధి మండలంలో గాలికొండ, గుమ్మిరేవుల, గంగవరం మండలంలో లక్కొండ గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హుకుంపేట మండలం రంగశీల,శోభకోట,కొయ్యూరు మండలం కొమ్మిక, శరభన్నపాలెం, కూనవరం మండలంలో చెరువులగూడెం, మారేడుమిల్లి మండలంలో డి.వి.కోట,పెదబయలు మండలంలో జామిగుడ,రాజవొమ్మంగి మండలంలో అమినబడ, చెరుకుంపాలెం, వీఆర్‌పురం మండలంలో జీడిగుప్ప, వై.రామవరం మండలంలో కోట గ్రామసచివాలయాల్లో జరిగే జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తప్పిపోయిన విద్యార్థులు అరకువేలీలో ప్రత్యక్షం

- గుర్తించిన అరకు పోలీసులు
- తల్లిదండ్రుల సమక్షంలో సీతానగరం పోలీసులకు అప్పగింత

అరకులోయ టౌన్: తప్పిపోయిన ఇద్దరు విద్యార్థులను పట్టుకున పోలీసులు వారి తల్లిదండ్రులకు గించారు. మన్యం జిల్లా పార్వతీపురం సీతానగరం కళాశాలలోని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అల్లూరి జిల్లా పెదబయలు గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (16), ముంచంగిపుట్టు గ్రామానికి చెందిన గెమ్మెలి దిల్షాన్(15) కళాశాల నుంచి తప్పిపోయారు. ఈ విషయంపై సీతానగరం కళాశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఈ విషయాన్ని అరకువేలీ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు గాలింపు చర్యలు చేపట్టిన స్థానిక పోలీసులు సోమవారం రాత్రి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఉన్న ఇద్దరు విద్యార్థులను ప్రశ్నించారు. వారి తెలిపిన సమాచారం మేరకు సీతాననగరం కళాశాల విద్యార్థులుగా గుర్తించారు. దీంతో ఎస్‌ఐ సంతోష్ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం తెలియజేశారు. వారి సమక్షంలోనే ఇద్దరు విద్యార్థులను సీతానగరం పోలీసులకు అప్పగించినట్లుగా ఎస్‌ఐ తెలిపారు.



విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో సీతానగరం పోలీసులకు అప్పగిస్తున్న అరకువేలీ పోలీసులు

క్లుప్తంగా

వెదురు కొమ్ముల సీజన్ ప్రారంభం

● విక్రయిస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: మన్యంలో వెదురు కొమ్ముల సీజన్ ప్రారంభమైంది. వెదురు పొదల మొదల్లో చిగుళ్లను గిరిజనులంతా పూర్వం నుంచి వెదురు కొమ్ములుగా పిలుస్తుంటారు. ఈ చిగుళ్లను సేకరించి వాటిని మంచి శాఖాహార వంటకంగా ఈ సీజన్‌లో గిరిజనులతో పాటు మైదాన ప్రాంత ప్రజలు కూడా అధికంగా తింటుంటారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వెదురు చెట్ల మొదళ్లకు చిగుళ్ల ఏర్పడ్డాయి. అడవులతో పాటు గిరిజనులు సొంతంగా వేసుకున్న వెదురు చెట్ల వద్ద ఈ చిగుళ్లను గుర్తిస్తు వాటిని వెంటనే సేకరించి ఇళ్లకు తీసుకువస్తున్నారు. వారపుసంతలు, మండల కేంద్రాల్లో ప్రస్తుతం వెదురు కొమ్ములను గిరిజనులు అమ్మకాలు జరుపుతున్నారు. రూ.50ల నుంచి రూ.100ల ధరతో వెదురు కొమ్ముల వాటాను గిరిజనులు విక్రయిస్తున్నారు.

జోరు వానలో వరినాట్లు


వర్షంలో వరినాట్లు వేస్తున్న గిరిరైతులు

అరకులోయ టౌన్: వరుణ దేవుడి కరుణతో వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడం ముమ్మరంగా ఖరీఫ్ పనులు సాగుతున్నాయి. జోరువానలో సైతం గిరి రైతులు వరినాట్లు వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 22 టన్నుల డీఏపీని ఆర్‌బీకేల ద్వారా గిరిరైతులకు అందించినట్టు ఏడీ వి.మోహన్‌రావు తెలిపారు. ఈ వారంలో మరో 22 టన్నుల డీఏపీని అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన చెప్పారు.

21న 'ఒక్కడే వీరుడు-అల్లూరి' విడుదల

దాబాగార్డెన్స్(విశాఖ): స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి వాస్తవ చరిత్ర పేరిట రూపొందించిన 'ఒక్కడే వీరుడు–అల్లూరి సీతారామరాజు'చిత్రాన్ని ఈ నెల 21న విడుదల చేయనున్నట్టు చిత్ర నిర్మాత, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక సభ్యుడు రాజాసాగి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అనగాదేవి మూవీస్ పేరిట చిత్ర నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి ముందుగా ఈ చిత్రాన్ని నిర్మించానన్నారు. అల్లూరి జన్మించిన పాండ్రంగిలోనే తాను కూడా జన్మించి, నివాసంఉంటున్నానని, అందుకే ముందుగా అల్లూరి చరిత్రను చిత్రంగా తీసినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, సంఘం గౌరవ అధ్యక్షుడు దంతులూరు సుబ్బరాజు,ఎలీషా ప్రసాద్, శివంగి నాగేశ్వరరావు, బళ్ల శ్రీనివాస్, వెల్లాల నాగార్జున చిత్రంలో తల్లి పాత్రధారిణి మంతెన మాధవి,కల్లేపల్లి సంతోష్ వర్మ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

● అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
● లింగేటిలో రైతు భరోసా కేంద్రం ప్రారంభం


లింగేటిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి సీఎం జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని లింగేటి సచివాలయంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో రైతుల కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు మండల కేంద్రానికి రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని నేడు మన గడప వద్దకే ప్రభుత్వం అన్నీ అందజేస్తోందని చెప్పారు.

గడప వద్దకే సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమంలో గడప వద్దకే 11 రకాల ధ్రువీకరణ పత్రాలనుప్రభుత్వం అందజేస్తోందని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. బొంగరం పంచాయతీ పరిధిలో 1020 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, వైఎస్సార్‌సీసీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ,మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో పూర్ణయ్య,తహసీల్దార్ కృష్ణారావు,వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సర్పంచ్‌లు కాతారి సురేష్‌కుమార్,బాలయ్యదొర, కాసులమ్మ,లక్ష్మీపతి,మాజీ సర్పంచులు ప్రసాద్ నాయుడు,అప్పన్న, వైఎస్సార్‌సీపీనాయకులు రాంబాబు, పూర్ణారావు,బొర్ర అప్పన్న, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి

రంపచోడవరం మేజిస్ట్రేట్ ప్రవీర్ బంజదేవ్

గంగవరం : చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని రంపచోడవరం మేజిస్ట్రేట్ ప్రవీర్ బంజదేవ్ సూచించారు. మంగళవారం అడ్డతీగల కోర్టుకు వెళ్తున్న ఆయన ఆకస్మికంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. గిరిజన విద్యార్థినులతో కాసేపు మాట్లాడారు. ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలలో సమస్యలను ఆయన తెలుసుకున్నారు. బాలికల వసతి గృహం, వంటశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో సమస్యలను హెచ్‌ఎం ఝాన్సీ హేన్సన్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలలో భోజనశాల షెడ్డు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ అవసరమని ఆమె పేర్కొన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి ఐటీడీఏ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని మెజిస్ట్రేట్ హామీ ఇచ్చారు. బాలికల విద్య , ఆరోగ్య విషయాల్లో శ్రద్ధ వహించాలని, మోనూ ప్రకారం పోష్టకాహారం అందించాలని సూచించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్ఐ జేబీఆర్ రెడ్డి, ఏఎస్ఐ రజాక్, డిప్యూటీ వార్డెన్ లక్ష్మీకాంత, మహిళా పోలీసులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టులో తాండవ నీటి విడుదల

● రైతులు వరి నారు సిద్ధం చేసుకోండి
● తాండవ ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ డీఈ కృష్ణారావు, తాండవ ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు

నాతవరం: శిథిలమైన కాలువలను మరమ్మతులు చేసి శివారు ఆయకట్టుకు సైతం పుష్కలంగా నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తాండవ ప్రాజెక్టు డీఈ జె.స్వామినాయుడు తెలిపారు. తాండవ కుడి కాలువ 8వ కిలోమీటరు వద్ద కృష్ణాపురం సమీపంలో రూ.39 లక్షలతో నిర్మిస్తున్న కల్వర్టు పనులను క్వాలిటీ డీఈ ఎ.కృష్ణారావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. కల్వర్టు నిర్మాణానికి ఉపయోగించే ఐరన్, సిమెంట్ నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. తాండవ కుడి, ఎడమ కాలువకు పలు ప్రాంతాల్లో చేస్తున్న అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డీఈ స్వామినాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు ఆశించిన విధంగా కురియకపోవడంతో తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 369.5 అడుగులు మాత్రమే ఉందన్నారు. ఆ నీటిని ఆయకట్టుదారులు, ప్రజాప్రతినిధుల అభీష్టం మేరకు ఆగస్టు రెండవ వారంలో విడుదల చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నీటిని విడుదల చేసే ముందు రెండు ప్రధాన కాలువల్లో పూడికను తొలగిస్తామన్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో కాలువలో పలు చోట్ల నీరు చేరి, పూడిక తొలగించేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. కాకినాడ జిల్లా కేతా చిన్నయ్యపాలెం ప్రాంతంలో కాలువపై నిర్మించిన కల్వర్టు భారీ వర్షాలకు శిథిలం కావడంతో కల్వర్టును నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆగస్టులో తాండవ నీటిని విడుదల చేయనుండటంతో, ఆయకట్టు పరిధిలో రైతులంతా వరినారు సిద్ధం చేసుకోవాలన్నారు. తాండవ నీటి విడుదల విషయంపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఆయన వెంట కేతా చిన్నయ్యపాలెం, కోటనందూరు సెక్షన్ జేఈలు రవికుమార్, రమణ, నాగబాబు, కాంట్రాక్టరు నాగన్నదొర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలతో ఆర్థికాభివృద్ధి

● ఎంపీపీ శెట్టి నీలవేణి


కొత్తూరులోని రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, తదితరులు

అనంతగిరి: ఉద్యానవన పంటలతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని కొత్తూరు పంచాయతీలో గిరిజన రైతులకు మంగళవారం సీతాఫలం, సపోటా, కొబ్బరి, నేరుడు, కమల మొక్కలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 500 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీతయ్య, వైస్ సర్పంచ్ నరేంద్ర, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, ఏపీవో అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

అనకాపల్లిటౌన్ : మండలంలో ఊడేరు గ్రామం మీదుగా గంజాయి అక్రమ రవాణాపై మంగళవారం గ్రామీణ పోలీసులు దాడి చేసి రెండున్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ముందస్తు సమాచారంతో గ్రామానికి చేరుకొని విజయవాడ కృష్ణలంకకు చెందిన మోహిత్ జోషి బ్యాగ్‌ను తనిఖీ చేయగా గంజాయి బయటపడినట్టు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు నిందితుడ్ని అదుపులోకి తీసుకొని విచారించగా మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని, వారు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఇంత నిర్లక్ష్యమా..!

● ఆరుబయట విలువైన డిజిటల్ కియోస్క్, యంత్రాలు
● పాడవుతున్నా పట్టించుకోని అధికారులు


వెలుగు కార్యాలయ అవరణలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల కటింగ్ యంత్రాలు

రాజవొమ్మంగి: రూ.లక్షల విలువైన డిజిటల్ కియోస్క్, యంత్ర సామగ్రి ఆరుబయట నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇవి పాడవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. డిజిటల్ కియోస్క్‌ను స్థానిక స్త్రీశక్తి భవనం ఆవరణలో ఆరుబయట వదిలేశారు. దీని పక్కనే మండల పరిషత్ కార్యాలయానికి చెందిన టాయ్‌లెట్ ఉండటంతో ఇది కూడా దానికి చెందినది అయి ఉండవచ్చని ఈ ప్రాంతానికి వచ్చిన వారు భావిస్తున్నారు. వ్యర్థాలను కత్తిరించే మరో రెండు యంత్రాలు (మరలు) కూడా ఇదే ప్రాంగణంలో నిరుపయోగంగా వదిలేశారు. ఎండకు ఎండి వానకు తడుస్తూ పాడవుతున్నాయి. దీనిపై ఎంపీడీవో యాదగిరీశ్వరరావును వివరణ కోరగా ఈ రెండు యంత్రాలు ఏశాఖకు చెందినవో తమకు తెలియదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు.

వచ్చేనెల 20 వరకు ఓటు హక్కు నమోదు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లత్సాపాత్రుడు

చింతపల్లి: వచ్చేనెల 20వ తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ జరుగుతుందని, పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ లత్సాపాత్రుడు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఓటరు నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 58,588 మంది ఓటర్లున్నారని, వీరిలో పురుషులు 28,241 మంది ,మహిళలు 30,344 మంది, ట్రాజెండర్లు ముగ్గురున్నారన్నారు.మండలంలో 77 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు.ప్రతి కేంద్రానికి ఒక్కరు చొప్పున 77 మంది బీఎల్‌వోలను నియమించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల యాత్రకు ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: పుణ్యక్షేత్రాలు, ఆలయాల సందర్శనకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు ప్యాకేజీలను ప్రకటించింది. మొదటిసారిగా అయోధ్య వంటి ప్రాంతాలను కూడా ఈ టూర్‌లో సందర్శించే అవకాశం కలిస్తోంది. భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ పేరిట 13 స్లీపర్, 3-థర్డ్ ఏసీ, 1-సెకండ్ ఏసీ కోచ్‌లతో ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ, సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ బిసా వెల్లడించారు. ఈ యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుంది. ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో జూలై 26వ తేదీన బయలుదేరుతుంది. ఈ యాత్రకు వెళ్లాలనుకునే వారు పెందుర్తి, విజయనగరంలో ఈ రైలు ఎక్కాల్సి ఉంటుంది. అదే స్టేషన్‌లో తిరిగి దిగుతారు. పూరి, గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన జగన్నాథ్ ఆలయం, సూర్యనారాయణ ఆలయం, పిండ ప్రదానం, విష్ణుపాదం ఆలయం, కాశీ విశ్వనాథ ఆలయం, విశాలాక్షి ఆలయం, అన్నపూర్ణదేవి ఆలయం, గంగా హారతి, రామ జన్మభూమి, హనుమాన్ గర్హి ఆలయం, త్రివేణి సంగమం, హనుమాన్ మందిర్, శంకర్ విమాన్ మండపం వంటి ప్రదేశాలను సందర్శించవచ్చు. ఒక్కొక్కరికి టికెట్, వసతి, స్థానిక రవాణా చార్జీలతో కలిపి ఎకానమీ 15,075, పిల్లలకు(5–11 సంవత్సరాల లోపు) 14,070, స్టాండర్డ్ 23,875, పిల్లలకు(5–11సంవత్సరాల లోపు) 22,695, కంఫర్ట్ 31,260, పిల్లలకు(5–11సంవత్సరాల లోపు) 29,845 (అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి)గా ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ఎకానమీ ప్రయాణికులకు నాన్ ఏసీ బడ్జెట్ హోటల్‌లో, నాన్ ఏసీ వాహనాల్లో తీసుకెళ్తారు. స్టాండర్డ్/కంఫర్ట్ ప్రయాణికులకు థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ రూంలలో వసతి కల్పిస్తారు. నాన్ ఏసీ/ఏసీ వాహనాల్లో తీసుకెళ్తారు. ఉదయం టీ, అల్పాహారం , మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తారు. మరిన్ని వివరాలకు రైల్వేస్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో గానీ, చందన్‌కుమార్(82879 32318), ఎస్.విశాలాక్షి(97010 85461)ను గానీ సంప్రదించవచ్చు.

యువతి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి


స్వప్న మృతదేహం

ఆరిలోవ(విశాఖ): చినగదిలిలో ఆత్మహత్య చేసుకున్న శెట్టి స్వప్న(22) మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం సరవి గ్రామానికి చెందిన శెట్టి స్వప్న చినగదిలిలో అద్దింట్లో ఉంటూ రామాటాకీస్ సమీపంలో ఓ బ్యూటీపార్లర్‌లో పని చేస్తుంది. సోమవారం ఆమె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అనంతరం ఏఎస్ఆర్ జిల్లాలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆమె ఒంటరిగా ఉండడం, ఎలాంటి కారణాలు తెలియకపోవడంతో సంఘటన జరిగిన రోజు పోలీసులకు ఎలాంటి వివరాలు లభించలేదు. తల్లిదండ్రులు మంగళవారం వచ్చిన అనంతరం వారి నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. దీనిపై మృతురాలు తల్లిదండ్రులు శెట్టి గుణం , స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్వప్న తమ కుటుంబానికి తెలిసిన గొర్రెల చిన్నారావుకు రూ.85,000 అప్పు ఇచ్చింది. ఆ డబ్బులు తిరిగి అతను ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సోమవారం చిన్నారావు.. స్వప్నకు ఫోన్ చేసి డబ్బులు విషయంపై మాట్లాడాడు. దీనిపై వారి మధ్య మాటామాటా పెరిగి ఫోన్‌లో తగాదా జరిగింది. మధ్యలో చిన్నారావు ఫోన్ ఆపేశాడు. కొద్ది సేపటికి ఆమె ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

యాసిడ్ దాడుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

పోలీస్ అధికారులకు ఎస్పీ మురళీకృష్ణ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: యాసిడ్ దాడుల నియంత్రణకు పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. ది పాయిజన్ యాక్ట్–1919, ఏపీ పాయిజన్(పొసెషన్, విక్రయాలు) రూల్స్–2016 మేరకు రసాయనాల విక్రయం, వినియోగంలో దుర్వినియోగం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తన కార్యాలయంలో బంగారు వర్తకులు, కళాశాలలకు సంబంధించిన లేబొరేటరీ నిర్వాహకులు, రసాయనాల విక్రయదారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. చట్ట నిబంధనలు, ఉల్లంఘిస్తే తీసుకునే చర్యల్ని వివరించారు. రసాయనాల అమ్మకం, కొనుగోలు విషయంలో నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే రసాయనాల విక్రయం, వినియోగంపై జిల్లా పోలీసు అధికారులు పటిష్టమైన నిఘా పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, డీఎస్పీ వి.సుబ్బరాజు, ఇన్‌స్పెక్టర్లు మోహనరావు, లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అలియాస్ అహ్మద్, గణేష్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు భూసేకరణ

● భవన యజమానుల కోరిక మేరకు ప్రభుత్వ నిర్ణయం
● నర్సీపట్నంలో అధికార యంత్రాంగం సమాయత్తం


నర్సీపట్నం మెయిన్ రోడ్డు

నర్సీపట్నం: భూసేకరణ ద్వారా మెయిన్ రోడ్డు విస్తరించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. టీడీఆర్ బాండ్లు వద్దు, నష్టపరిహారం చెల్లించాలని భవన యజమానులు కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. భవన యజమానుల అభ్యర్థన మేరకు భూసేకరణ ద్వారా నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విషయమై మంగళవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు అనకాపల్లిలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో సమావేశమయ్యారు. భూసేకరణకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో నర్సీపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నా.. గత పాలకులు పట్టించుకోకపోవడంతో ఆరు దశాబ్దాల నుంచి మెయిన్ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. నర్సీపట్నం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయించారు. గత ఏడాది డిసెంబర్‌లో రోడ్డు విస్తరణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. భవన యజమానులు 80 అడుగులకు విస్తరించాలని, టీడీఆర్ బాండ్లు కాకుండా నష్టపరిహారం నగదు రూపంలో చెల్లించాలని భీష్మించారు. వంద అడుగుల రోడ్డు విస్తరణకు సహకరించాలని అనేక దఫాలు సమావేశాలు ఏర్పాటు చేసి అధికారులు కోరినప్పటికీ భవన యజమానులు మెట్టు దిగలేదు. కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో భూసేకరణ ద్వారానే రోడ్డు విస్తరణ చేపట్టేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది రక్తదానం


రక్తదాన శిబిరంలో బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ పి.ఎం.పదాన్

దొండపర్తి: బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ నెల 20వ తేదీన 116వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రీజియన్ పరిధిలో అన్ని బ్రాంచ్‌లలో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.ఎం.పదాన్ తెలిపారు. మంగళవారం బ్యాంక్ రీజనల్ ఆఫీస్‌లో ఏఎస్‌రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రీజనల్ మేనేజర్ పదాన్ ప్రారంభించారు. ఇందులో 45 మంది బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 20వ తేదీ ఉదయం బీచ్ క్లీనింగ్, వాక్‌థాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

గుండె మార్పిడి శస్త్ర చికిత్సకు సాయం చేయరూ..


హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణ

మునగపాక : అసలే నిరుపేద కుటుంబం. పూట గడవడమే కష్టం. అలాంటి కుటుంబంలో ఓ యువకుడి ఆరోగ్య పరిస్థితి దయనీయంగా మారింది. గుండె మార్పిడి శస్త్ర చికిత్స అవసరమైంది. లక్షలాది రూపాయల ఖర్చుతో కూడిన ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా మారడంతో ఏం చేయాలో తెలియక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. మునగపాకకు చెందిన దొడ్డి రామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రామకృష్ణకు గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయాల్సి ఉంది. ఇందుకు రూ.35 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యాధికారులు చెప్పడంతో రామకృష్ణ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. తన కుమారుని వైద్యం కోసం సాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. రామకృష్ణ కుటుంబానికి సాయం అందించాలని అనుకునే వారు 7032655660 నంబరును సంప్రదించాలని కోరుతున్నారు.

ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు


అలంక షణ్ముఖ అన్వేష్‌కుమార్ (ఫైల్)

కశింకోట : తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట గ్రామంలో 25 ఏళ్ల ప్రైవేటు పరిశ్రమ ఉద్యోగి కనిపించకపోవడంపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. వివరాలివి. బంగారయ్యపేటకు చెందిన అలంక షణ్ముఖ అన్వేష్‌కుమార్ (25) పరవాడ వద్ద అరబిందో పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతను సోమవారం ఉదయం బంగారయ్యపేటలోని తన ఇంటి నుంచి బయలుదేరి మాకవరపాలెం మండలం కోడూరు గ్రామానికి బియ్యం తేవడం కోసం వెళ్లాడు. అయితే అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. అన్వేష్‌కుమార్ అన్న సాయి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.